క్లుప్తంగా

నేటి నుంచి పట్టాభి రామాలయ మహా సంప్రోక్షణ



వేడుకలకు ముస్తాబైన పట్టాభిరామస్వామి ఆలయం

బేస్తవారిపేట: స్థానిక తేరు బజారులోని పట్టాభి రామస్వామి దేవస్థానం మహా సంప్రోక్షణ కార్యక్రమం సందర్భంగా ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 16న గణపతిపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, అఖండ దీపస్థాపన, ప్రధాన కలశస్థాపన, రుద్రాభిషేకం, 17న హనుమాన్ చాలీసా పారాయణం, పంచామృతాలు, అభిషేకములు, చండీ పారాయణ, అవాహితా దేవతా హోమాలు, సుదర్శన హోమం, 18న విశేష అర్చనలు, మూలమంత్ర హోమాలు, పూర్ణాహుతి, ఆలయ సంప్రోక్షణ, శిఖర కలశాభిషేకం, శాంతి కళ్యాణ పూజలు, మధ్యాహ్నం అన్న సంతర్పణ, రాత్రికి గ్రామోత్సవం నిర్వహిస్తామని వివరించారు.

అల్లూరి పోలేరమ్మకు ఘనంగా పూజలు



ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగశిలలకు ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ఆలయ చైర్మన్, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

చట్టాలపై ఖైదీలకు అవగాహన కల్పించాలి



గిద్దలూరు జైలును పరిశీలిస్తున్న జడ్జి భారతి

గిద్దలూరు రూరల్: జైల్లో ఉంటున్న ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి పేర్కొన్నారు. స్థానిక సబ్‌జైలును ఆదివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలు రికార్డులు పరిశీలించారు. విచారణ ఖైదీలకు న్యాయవాది ఉన్నారా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక స్థోమత లేని వారికి ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. క్షణికావేశంలో నేరాలకు పాల్పడి జైలుకు వచ్చిన ఖైదీలతో మర్యాదగా ప్రవర్తించాలని సిబ్బందికి సూచించారు. ఖైదీలపై చులకన భావం చూపరాదన్నారు. ఖైదీల జీవితాన్ని మంచిగా మార్చి సమాజంలోకి పంపేలా జైలు కేంద్రాలు పనిచేయాలన్నారు. ఖైదీలకు అందజేసే ఆహారం నాణ్యంగా ఉండాలని చెప్పారు. ఖైదీలను కుటుంబ సభ్యులతో మాట్లాడించేందుకు ప్రయత్నించాలని, అప్పుడే వారిలో కుటుంబ సభ్యులపై ప్రేమానురాగాలు నెలకొంటాయన్నారు. కేసుల నుంచి బయటకు వచ్చిన వారు క్రమశిక్షణగా మెలగాలన్నారు. కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ కె.శ్యాంబాబు, గిద్దలూరు జూనియర్ సివిల్ జడ్జి ఎ.ఓంకార్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరిసారాధానమ్మ, జైలు సూపరింటిండెంట్ లింగారెడ్డి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

హతవిధీ.. పరిష్కారమేదీ?

- భూముల రిజిస్ట్రేషన్‌కు కొర్రీ పడటంతో రైతుల గగ్గోలు
- సర్వీస్ ఇనాం భూములంటూ రిజిస్ట్రేషన్, రెవెన్యూ అధికారుల మెలిక
- గతంలో లేని సమస్య ఇప్పుడెందుకొచ్చిందని ప్రశ్నిస్తున్న రైతులు
- పొలాలు, స్థలాల రిజిస్ట్రేషన్ కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చక్కర్లు



గ్రామసభలో ఇనాం భూముల గురించి అధికారులతో మాట్లాడుతున్న ప్రజలు(ఫైల్)

కంభం:

గతంలో సజావుగా సాగిన భూములు, స్థలాల రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో జనం అయోమయానికి గురవుతున్నారు. ఆడపిల్లల వివాహం, ఇంటి నిర్మాణం, అప్పులు తీర్చడం కోసం స్థలాలు, పొలాలు విక్రయించి నగదు సర్దుబాటు చేసుకోవాలన్న ఆశలు నెరవేరకపోవడంతో ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. నగదు అడ్వాన్స్ తీసుకుని రిజిస్ట్రేషన్ చేసివ్వలేకపోతుండటంతో భూమి కొనుగోలు చేసిన వ్యక్తులకు ఏం సమాధానం చెప్పాలో అర్థం కాక సతమతమవుతున్నారు. ఇనాం భూములని పేర్కొంటూ రిజిస్ట్రేషన్ చేయడం కుదరదని అధికారులు చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. గతంలో నాలుగైదు సార్లు రిజిస్ట్రేషన్లు జరిగిన భూములు ఇప్పుడు కొత్తగా ఇనాం ఎలా అవుతాయని ప్రజలు ప్రశ్నిస్తున్నా అధికారుల నుంచి సరైన సమాధానం లేదు. సబ్ రిజిస్ట్రార్లు మాత్రం «ఆన్‌లైన్‌లో ఉన్న ఇనాం అనే పదాన్ని తొలగించుకుని రండి, అప్పుడే రిజిస్ట్రేషన్ చేస్తామ»ని చెబుతున్నారని, రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్తే ఇనాంను తొలగించడం కుదరదంటున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. తమ సమస్య ఎలా పరిష్కారమవుతుందో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇనాం భూములంటే..

పూర్వపు రోజుల్లో రాజులు, ప్రభువులు, జాగీరుదారులు, భూస్వాములు తమ దగ్గర పనిచేసిన సిపాయిలు, కవులు, చిత్రకారులు, కుల వృత్తులకు చెందిన వారికి బహుమతిగా ఇచ్చిన భూములను ఇనాం అని అంటారు. అలాంటి భూములపై వారు పూర్తి హక్కులు కలిగి ఉంటారు. అలా కాకుండా ఒక కమ్యూనిటీకి సంబంధించి ఎవరైనా భూములు దానం చేసి ఉంటే వాటిని సర్వీస్ ఇనాం అని అంటారు. అటువంటి భూములు ఒక వ్యక్తికి సంబంధించి ఉండవు. ఆ కమ్యూనిటీకి ఉపయోగించుకునేలా వీలు కలిగి ఉంటుంది. అటువంటి భూములను విక్రయించే హక్కులు ఎవరికీ ఉండవు.

గ్రామ సభల్లో అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజలు

ఇటీవల రెవెన్యూ గ్రామ సభల్లో రైతులు, ప్రజలు ఇనాం అని ఉండటం వల్ల తమ రిజిస్ట్రేషన్లు ఆగిపోతున్నాయని రెవిన్యూ అధికారులను నిలదీశారు. తమ సమస్యను పరిష్కరించాలని అర్జీలు ఇచ్చినా అది మార్చడం తమ పరిధిలో లేదని చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. గత గురువారం హజరత్‌గూడెంలో జరిగిన గ్రామసభలో పలువురు ప్రజలు ఇనాం భూముల సమస్యను అధికారులకు వివరించారు. దీనిపై అర్జీదారులకు సరైన పరిష్కారం లభించకపోవడంతో తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు.

పిల్లల చదువు కోసం పొలం అమ్మాను.. రిజిస్ట్రేషన్ కావడం లేదు



నాకు కాగితాలగూడెం ఇలాకాలో 2.30 ఎకరాల భూమి ఉంది. 2014–2020 వరకు మూడు సార్లు రిజిస్ట్రేషన్లు జరిగాయి. ప్రస్తుతం పిల్లల చదువు నిమిత్తం పొలం అమ్ముకున్నాను. కొన్నవారికి రిజిస్ట్రేషన్ చేసి ఇద్దామని వెళ్తే ఇనాం అని చెప్పి వెనక్కి పంపారు. రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్తే అది తమ పరిధిలో లేదని చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మా సమస్యను పరిష్కరించాలి.

– సయ్యద్ మౌలాలి, హజరత్‌గూడెం

జిల్లా అధికారులు స్పందించాలి



ఆర్థిక ఇబ్బందులతో నాకున్న అర ఎకరా భూమిని అమ్మా. ఇనాం భూమిగా ఆన్‌లైన్‌లో చూపిస్తోందని చెప్పి రిజిస్ట్రేషన్ చేయడం లేదు. గతంలో ఎన్నడూ లేని ఈ సమస్య ఎలా వచ్చిందో మాకు తెలియడం లేదు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నాం.

– డి.చిన్నసుబ్బయ్య, హజరత్‌గూడెం

సర్వీస్ ఇనాంను మాత్రమే రిజిస్ట్రేషన్ చేయడం లేదు

సర్వీస్ ఇనాంకు సంబంధించిన భూములు మాత్రమే రిజిస్ట్రేషన్ చేయడానికి కుదరదు. రైత్వారీ ఇనాం, ఇతర భూములు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. వాటికి ఎటువంటి ఇబ్బందులు లేవు.

– బాల ఆంజనేయులు, జిల్లా రిజిస్ట్రార్

ఆర్ఎస్ఆర్‌లో మార్చడం కుదరదు

ఇనాం భూములని ఇప్పుడు కొత్తగా మార్చింది కాదు. ఆర్ఎస్ఆర్ పుట్టినప్పటి నుంచి భూమి స్వభావాన్ని బట్టి అందులో పొందుపరిచారు. భూముల క్లాసిఫికేషన్‌ను మార్చే అధికారం, వెసులుబాటు మా పరిధిలో లేదు.

– వి.కిరణ్, తహసీల్దార్, కంభం

పొదిలి ఏఎంసీ ప్రహరీ గేటు ధ్వంసం



ప్రహరీ నిర్మాణ సమయంలో వేసిన శిలాఫలకం

- గేటును ఎత్తుకెళ్లేందుకు దుండగుల విఫలయత్నం
- చిల్లచెట్లు మొలిచి చిట్టడవిని తలపిస్తున్న ఏఎంసీ ఆవరణ
- పాలకుల తీరుపై రైతుల ఆగ్రహం



తలమళ్ల సమీపంలో ఏఎంసీ గేటు ధ్వంసం చేసిన దుండగులు

పొదిలి రూరల్: పొదిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రహరీ నిర్మాణానికి ఏర్పాటు చేసిన తలుపులను గుర్తు తెలియని దుండగలు ధ్వంసం చేశారు. ఈ సంఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పొదిలి మండలంలోని తలమళ్ల సమీపంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.60 లక్షల అంచనా వ్యయంతో ఏఎంసీ ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టారు. 2021 ఆగస్టు 23వ తేదీన పనులకు శంకుస్థాపన చేసి వేగంగా పూర్తి చేశారు. ప్రహరీకి ఇనుప గేట్లు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఎన్నికల కోడ్ రావడం.. నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏఎంసీ నిర్వహణను పట్టించుకోకపోవడంతో గుర్తు తెలియని దుండగలు ప్రహరీ ఇనుప గేట్లను ధ్వంసం చేశారు. గేటును ఎత్తుకెళ్లేందుకు విఫలయత్నం చేసినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఏఎంసీ ఆవరణలో భారీగా చిల్లచెట్లు మొలిచి చిట్టడివిని తలపిస్తోంది. ఆరు నెలలుగా ప్రజాప్రతినిధులుగానీ, అధికారులుగానీ ఏఎంసీ వైపు చూడలేదని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రహరీ గేటును పునర్నిర్మించడంతోపాటు ఏఎంసీ ఆవరణను రైతులు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ఏఎంసీ ఆవరణలో పెరిగిన చిల్లచెట్లు

నూతన టాయిలెట్లు ఏర్పాటు చేస్తాం


'ఇచ్చటొద్దు' సరే.. మరెచ్చట?

సాక్షి ఎఫెక్ట్..

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ పరిధిలో అనువైన ప్రదేశాల్లో కౌన్సిల్ అనుమతితో నూతన పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం త్వరలోనే చేపడతామని కమిషనర్ నారాయణరావు తెలిపారు. మార్కాపురంలో జనాభాకు తగిన విధంగా పబ్లిక్ టాయిలెట్లు లేకపోవడం, ఉన్న వాటి నిర్వహణ సక్రమంగా లేని వైనంపై «ఇచ్చటొద్దు సరే.. మరెచ్చట» శీర్షికన ఈ నెల 14న ప్రచురించిన కథనానికి కమిషనర్ స్పందించారు. పట్టణంలో ప్రస్తుతం ఉన్న పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణను రోజూ పర్యవేక్షించేలా శానిటరీ ఇన్‌స్పెక్టర్, వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలను ఆదేశించినట్లు కమిషనర్ తెలిపారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



మార్కాపురం : పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మండల పరిషత్ సిబ్బంది



తర్లుపాడులో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు



గిద్దలూరులో మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్

మార్కాపురం రూరల్: ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టిశ్రీరాములు అని మార్కాపురం ఎంపీడీఓ బి.శ్రీనివాసులు పేర్కొన్నారు. ఎంపీడీఓ ఆఫీసులోని మీటింగ్ హాల్లో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పొట్టిశ్రీరాములు పోరాటాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వి.శ్రీనివాస్, వెలుగు ఏపీఎం పిచ్చయ్య, సిబ్బంది, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

తర్లుపాడు: స్థానిక గాంధీ పార్కులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. యువత పొట్టి శ్రీరాములును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పొట్టిశ్రీరాములు విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు జగన్‌బాబు, జవ్వాజి విజయభాస్కర్‌రావు, నెహ్రూ యూత్ అధ్యక్షుడు పుల్లయ్య, జవ్వాజి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: పట్టణంలోని గ్రంథాలయంలో ఆదివారం పొట్టిశ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు గ్రంథపాలకురాలు నల్లబోతుల ప్రసన్నకుమారి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగాలకు పాల్పడిన పొట్టిశ్రీరాములు గురించి, దేశం కోసం అహర్నిశలు శ్రమించి ఉక్కు మనిషిగా పేరుగాంచిన సర్దార్ వల్లభాయ్‌పటేల్ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు.

డిపోలో గుంతలు పూడ్చుతాం


గుంతల డిపో.. కాస్త చూసిపో..!

మురికి కుంటను తలపిస్తున్న డిపోలో ఖాళీ స్థలం

డిపో ముందు భాగంలో నిలిచిన వర్షం నీరు(ఫైల్)

డిపో లోపలికి వెళ్లే ప్రధాన రోడ్డు దుస్థితి ఇదీ..

- దారుణంగా గిద్దలూరు ఆర్టీసీ డిపో ప్రాంగణం
- ఆదాయంపైనే కాదు మౌలిక వసతులపై దృష్టి సారించాలని ప్రజల వినతి

- డీఎం చంద్రశేఖర్

సాక్షి ఎఫెక్ట్..

గిద్దలూరు రూరల్: గిద్దలూరు ఆర్టీసీ డిపో ఆవరణలో గుంతలు పూడ్చించి, ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. ఆర్టీసీ డిపో అస్తవ్యస్తంగా ఉన్న తీరుపై ఈ నెల 14న 'గుంతల డిపో.. కాస్త చూసిపో'శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనంపై ఆయన ఆదివారం స్పందించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా డిపో ఆవరణలో నీరు చేరి మురుగుమయమైన మాట వాస్తవమేనని డీఎం పేర్కొన్నారు. నగర పంచాయతీ కమిషనర్‌తో మాట్లాడి డిపో ఆవరణలో నిలిచిన నీటిని బయటకు పంపించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. డిపోలో మౌలిక వసతులు కల్పించే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతామన్నారు.

విద్యార్థులను క్రీడల దిశగా ప్రోత్సహించాలి



క్రీడాకారులతో పట్టణ ఎస్సైలు

మార్కాపురం: తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల దిశగా ప్రోత్సహించాలని మార్కాపురం పట్టణ ఎస్సైలు సైదుబాబు, డాక్టర్ రాజమోహన్‌రావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కమలా సీబీఎస్‌ఈ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన బాస్కెట్‌బాల్, టెన్నిస్ కోర్టును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఉద్యోగాల్లో క్రీడలకున్న రిజర్వేషన్లు, సదుపాయాల గురించి వివరించారు. విద్యార్థులు తమకు ఇష్టమైన క్రీడను సాధన చేసి రాణించాలని ఆకాంక్షించారు. క్రీడలు మానసిక ఆరోగ్యం, శారీరక దృఢత్వానికి దోహదం చేస్తాయన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పవన్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ స్వరూప్ రంజన్, పీఈటీ ఎస్.రజనీష్, శ్రీకాంత్, హరిలాల్ నాయక్ పాల్గొన్నారు.



మార్కాపురం : ప్రత్యేక అలంకరణలో స్వామివారు



బేస్తవారిపేట : అనఘాలక్ష్మీ సమేత దత్తాత్రేయ స్వామి కళ్యాణం



బేస్తవారిపేట : దత్తాత్రేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



మార్కాపురం : దత్తాత్రేయ హోమంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా దత్తాత్రేయ జయంతి

బేస్తవారిపేట: స్థానిక శ్రీదత్తసాయి మందిరం, నెహ్రూ బజార్‌లోని సాయి నిలయంలో దత్త జయంతి దశమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలో దత్తాత్రేయస్వామి ఊరేగింపు కనుల పండువగా సాగిందిరు. ఉదయం బాబాకు కాకడ హారతి, పంచామృత అభిషేకాలు, గురు చరిత్ర పారాయణం, అనఘాలక్ష్మి సమేత దత్తాత్రేయ స్వామి కళ్యాణం, మధ్యాహ్నం అన్నసంర్పణ చేశారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా దత్త జయంతి

మార్కాపురం: స్థానిక నెహ్రూ బజారులో ఉన్న షిరిడీ సాయి బాబా మందిరంలో దత్త జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, దత్తాత్రేయ హోమం, మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. గత వారం రోజులుగా మందిరంలో భక్తులు గురుచరిత్ర, దత్తాత్రేయ పారాయణం చేసినట్లు అర్చకులు ఎం.రవిశంకరశర్మ తెలిపారు. సాయంత్రం పల్లకి ఉత్సవం శోభాయమానంగా సాగింది. మందిర అధ్యక్ష కార్యదర్శులు పేరం సత్యనారాయణ, గోపాలుని హరిహరరావు, కోశాధికారి నాగరాజు, ఉపాధ్యక్షుడు గోపి, పవన్, కరీం, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బేస్తవారిపేటలో దత్తాత్రేయస్వామి ఊరేగింపు